సాక్షి రంగారెడ్డి

గురువారం । 14 । డిసెంబర్ । 2023



అయోధ్య టు శ్రీలంక

మహారాష్ట్రకి చెందిన ముగ్గురు మాజీ సైనికులు అయోధ్య నుంచి శ్రీలంక వరకు సైకిల్ యాత్ర చేపట్టారు. 8లో▸



అభివృద్ధికి సహకరించండి

రాష్ట్ర మంత్రి సీతక్కను రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. 8లో▸



కార్యాలయం ప్రారంభం

షాద్‌నగర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయాన్ని బుధవారం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. 8లో▸

సభాపతికి లైన్ క్లియర్

ప్రసాద్‌కుమార్‌కు శాసనసభ స్పీకర్ పదవి లాంఛనమే

- ఒకే నామినేషన్ దాఖలు కావడంతో పోటీ లేకుండానే ఎన్నికకు అవకాశం
- ఉమ్మడి జిల్లాకు మొదటిసారి దక్కనున్న గౌరవం
- రాష్ట్రంలో మొదటి దళిత స్పీకర్ కూడా ఆయనే

వికారాబాద్: అసెంబ్లీ స్పీకర్‌గా వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ ఎంపిక లాంఛనమే కానుంది. బుధవారం ఆయనొక్కరే నామినేషన్ దాఖలు చేశారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ సైతం ఆయనకు మద్దతు తెలపడంతో ఎంపిక ఏకగ్రీవం కానుంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వికారాబాద్ అసెంబ్లీ స్థానం నుంచి ప్రసాద్‌కుమార్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. గతంలో మంత్రిగా పని చేసిన ఆయన రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో మంత్రి పదవిని ఆశించారు. తన సామాజిక వర్గం నుంచి తీవ్ర పోటీ ఉండటంతో ఆ ఆశలు వదులుకున్నారు. మూడోసారి ఎమ్మెల్యేగా గెలవడం, గతంలో మంత్రిగా పని చేసిన అనుభవం ఉండటం తదితర విషయాలను పరిగణనలోకి తీసుకున్న అధిష్టానం పెద్దలు ప్రసాద్‌కుమార్‌ను స్పీకర్ పదవికి ఎంపిక చేశారు.

అనతి కాలంలోనే..

తాండూరు వాస్తవ్యుడైన ప్రసాద్‌కుమార్ మర్పల్లి ఎంపీపీగా జిల్లాలో రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. 2008 ఉప ఎన్నికల్లో మొదటిసారిగా వికారాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ వెంటనే 2009లో జరిగిన సాధారణ ఎన్నికల్లోనూ విజయం సాధించి మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గంలో జౌళి శాఖ మంత్రిగా పని చేశారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో మళ్లీ వికారాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి మొదటి స్పీకర్ కానుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో రాష్ట్రంలో మొదటి దళిత స్పీకర్‌గా కూడా గడ్డం ప్రసాద్‌కుమార్ రికార్డు సృష్టించనున్నారు.



అసెంబ్లీ స్పీకర్‌గా నామినేషన్ వేయడానికి వచ్చిన గడ్డం ప్రసాద్‌కుమార్‌తో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యేలు టీఆర్‌ఆర్, మల్‌రెడ్డి రంగారెడ్డి, బీఎంఆర్, సామేలు

న్యూస్‌రీల్

'అభయహస్తం'ను పునరుద్ధరించండి

బీమా మిత్ర ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు అనిలారెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డితో అనిలారెడ్డి, నర్సమ్మ

హయత్‌నగర్: పేద మహిళలకు ఎంతగానో ఉపయోగపడిన అభయ హస్తం పథకాన్ని గత ప్రభుత్వం రద్దుచేసిందని దీనిని మరింత మెరుగు పరిచి పునరుద్ధరించాలని తెలంగాణ బీమామిత్ర ఉద్యోగ సంఘం నాయకులు మంగళవారం రాత్రి ప్రజాభవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. అభయ హస్తం పథకం ద్వారా రాష్ట్రంలో సుమారు 45 లక్షల మంది మహిళలు లబ్ధిపొందేవారని అన్నారు. గత ప్రభుత్వం 2017లో బీమా పథకం, 2020లో అభయ హస్తం పథకాలను రద్దు చేసిందని దీంతో ఈ పథకంలో సభ్యులకు ఎలాంటి లబ్ధి జరగడం లేదని సీఎం దృష్టికి తీసుకువచ్చారు. గ్రామీణ మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న ఈ పథకంలో కావాల్సిన మార్పులు చేసి తిరిగి ప్రారంభించాలని వారు కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బీమా మిత్ర ఉద్యోగుల సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు అనిలారెడ్డి, వికారాబాద్ జిల్లా అధ్యక్షురాలు నర్సమ్మ తదితరులు ఉన్నారు.

ఉద్యమకారుల సంక్షేమానికి కృషి

ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వేదభవానీ



నియామకపత్రం అందుకుంటున్న వేదభవానీ

మీర్‌పేట: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా మీర్‌పేట కార్పొరేషన్ పరిధి ఆర్‌ఎన్‌రెడ్డి నగర్‌కు చెందిన జి.వేదభవానీ నియమితులయ్యారు. ఈ మేరకు సమితి రాష్ట్ర అధ్యక్షుడు రూబీ స్టీవెన్సన్ బుధవారం భవానీకి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భవానీ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించడంతో పాటు ఉద్యమకారుల సంక్షేమానికి పాటుపడుతున్న తనను గుర్తించి పదవికి ఎంపిక చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి వెంకన్న, ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, యుగంధర్, రవీందర్, అశోక్, కృష్ణగుప్తా, శివకుమార్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు

పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్



గోదామ్‌ను తనిఖీచేసిన డీటీ రఘునందన్, అధికారులు

ఆమనగల్లు: రేషన్ దుకాణాల నిర్వహణలో డీలర్లు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ హెచ్చరించారు. ఆమనగల్లు పట్టణంలోని పౌరసరఫరాల శాఖ గోదామ్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. గోదామ్‌లో ఉన్న స్టాక్‌ను, రిజిస్టర్లను పరిశీలించారు. అక్కడే ఉన్న కొందరు డీలర్లతో ఆయన మాట్లాడారు. డీలర్లు చౌకధర దుకాణాల ద్వారా రేషన్ సరుకులను ప్రజలకు సక్రమంగా అందించాలని.. అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకోవడంతో పాటు డీలర్‌షిప్‌ను రద్దు చేయడానికి సిఫారసు చేస్తామని హెచ్చరించారు. పౌరసరఫరాల శాఖ గోదామ్ నిర్వహణపై డీలర్లు మౌఖికంగా కాకుండా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. గోదామ్‌లో బియ్యం బస్తాలను తూకం వేసిన తర్వాతే పంపించాలని ఆయన సూచించారు. డిసెంబర్ నెల ప్రారంభమై 13 రోజులు దాటినా ఇంకా రేషన్ దుకాణాలకు బియ్యం ఎందుకు పంపించలేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. తీరుమార్చుకోకుంటే చర్యలు తప్పవన్నారు.

వారి కనుసన్నల్లోనే!



యథేచ్ఛగా భూ ఆక్రమణలు

- నిషేధిత భూముల్లో నిర్మాణాలు
- టీపీఓలు, ఆర్‌ఐలే అసలు సూత్రధారులు!

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కంచే చేను మేసిన చందంగా మారింది కొంతమంది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, టౌన్ ప్లానింగ్ అధికారుల వ్యవహారం. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన వారే.. పరోక్షంగా ఆక్రమణలను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులంతా అసెంబ్లీ ఎన్నికల బిజీలో ఉండగా.. కిందిస్థాయి అధికారులు కొంతమంది అక్రమార్కులకు అండగా నిలిచారని, ఇందుకు ప్రతిఫలంగా వారి నుంచి పెద్ద మొత్తంలో లబ్ధిపొందారనే విమర్శలు చెలరేగాయి. సదరు అధికారులు ఈకొద్ది రోజుల్లోనే రూ.కోట్లకు పడగలెత్తినట్లు తెలిసింది. టీపీఓలు వసూలు చేసిన మొత్తంలో సగం మున్సిపల్ కమిషనర్లకు, ఆర్‌ఐలు వసూలు చేసిన మొత్తంలో తహసీల్దార్లకు ముట్టజెబుతున్నట్లు తెలిసింది. ముఖ్యంగా నగరానికి ఆనుకుని ఉన్న హయత్‌నగర్ డివిజన్ సహా.. బడంగ్‌పేట్, పెద్దఅంబర్‌పేట్, తుర్కయంజాల్, ఆదిబట్ల, శంషాబాద్, తుక్కుగూడ, నార్సింగి, శంకర్‌పల్లి మున్సిపాలిటీల పరిధిలోని ప్రభుత్వ భూముల్లో పెద్దసంఖ్యలో అక్రమ నిర్మాణాలు వెలిశాయి.

కాసుల వర్షం..

పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ పసుమాముల సర్వే నంబర్ 47, 386, కుంట్లూరులోని సర్వే నంబర్ 37, తట్టి అన్నారంలోని సర్వే నంబర్ 127/1లోని ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయం తెలిసి కూడా ఆర్‌ఐ అటువైపు కన్నెత్తి చూడలేదు. అదేవిధంగా శంషాబాద్ మున్సిపాలిటీ సర్వే నం.103లోని నిషేధిత భూముల్లో అక్రమ నిర్మాణాలు స్థానిక టీపీఓకు, హయత్‌నగర్ మండలం బంజారాకాలనీ, ఆర్టీసీకాలనీ, మునుగనూర్‌లోని ప్రభుత్వ భూముల్లో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు ఆయా ప్రాంతాల్లోని రెవెన్యూ సిబ్బందికి కాసుల వర్షం కురిపిస్తున్నాయి. తుక్కుగూడ మున్సిపాలిటీ మంఖాల్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 776లోని కొత్తకుంటపై స్థిరాస్థి వ్యాపారుల కళ్లుపడ్డాయి. స్థానికులు ఇటు హెచ్‌ఎండీఏ, అటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఆక్రమణలు మాత్రం ఆగలేదు.

అనుమతులెలా ఇచ్చారో?

- బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 22వ వార్డులోని సాయిప్రభు కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డును కబ్జా చేసి దుకాణాలను నిర్మిస్తున్నా పట్టించుకునే నాథుడు లేడు. స్థానిక టీపీఓకు పెద్ద మొత్తంలో ముట్టజెప్పిన తర్వాతే నిర్మాణాలు చేపడుతున్నట్లు సంబంధిత ఆక్రమణదారు చెబుతుండటం కొసమెరుపు.
- రాజేంద్రనగర్ సర్కిల్ శివరాంపల్లి పిల్లర్ నంబర్ 278 సమీపంలో కేవలం 200 గజాల స్థలంలో 8 అంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. ఈ భవనానికి టౌన్‌ప్లానింగ్ అధికారులుఏ విధంగా అనుతులు ఇచ్చారో అంతుచిక్కడం లేదు.
- హయత్‌నగర్ మండలం శ్రీరానగర్ కాలనీలోని సర్వే నంబర్ 97లో పార్కుల కోసం కేటాయించిన 151/1, 115, 116 ప్లాట్లు కబ్జాకు గురవడమే కాకుండా వాటిలో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. వీటికి అనుమతులెవరిచ్చారనేది ప్రశ్నార్థకంగా మారింది.
- గోపన్‌పల్లి సర్వే నంబర్ 36,71/1, 71/2లో రూ.300 కోట్ల విలువ చేసే 5.30 ఎకరాల్లో ఈద్గవాని చెరువు ఉంది. రాత్రికి రాత్రే వందలాది వాహనాల మట్టితో చెరువు ఆనవాళ్లు లేకుండా చేశారు. ఇప్పటికే 80 శాతం భూమి ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లిపోయింది.
- శేరిలింగంపల్లి మండలం కొత్తగూడలోని సర్వే నంబర్ 44లోని రూ.25 కోట్ల విలువ చేసే 11 గుంటల ప్రభుత్వ భూమిపై కబ్జాదారుల కళ్లుపడ్డాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును, కడీలను తొలగించి దర్జాగా ఆక్రమించేశారు.
- గండిపేట మండలం పీరం చెరువు రెవెన్యూ సర్వే నంబర్ 62లో 15 ఎకరాల ప్రభుత్వ స్థలంను అక్రమార్కులు కబ్జాచేశారు. రెండు ఎకరాల్లో 60 గజాల చొప్పున ప్లాట్లు చేసి, వాటికి నకిలీ ప్రొసీడింగ్స్ సృష్టించి ఒక్కో ప్లాట్‌ను రూ.20 లక్షల చొప్పున విక్రయిస్తుండటం విశేషం.

150కి పైగా అక్రమ నిర్మాణాలు

అప్పోజిగూడ, చిలుకూరు రెవెన్యూలోని గండిపేట శిఖం, బఫర్‌జోన్లలో భారీగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. హిమాయత్ సాగర్ జలాశయం పరిధిలో ఇప్పటికే 49.25 ఎకరాలు, గండిపేటపరిధిలో 290 ఎకరాల శిఖం, బఫర్‌జోన్ స్థలాలు కబ్జాల పాలైనట్లు హెచ్‌ఎండీఏ, ఇరిగేషన్, జలమండలి, రెవెన్యూ అధికారుల సర్వేలో తేలింది. అజీజ్ నగర్, హిమాయత్‌సాగర్ గ్రామాల రెవెన్యూ పరిధులను ఆనుకుని ఉన్న 30 ఎకరాల భూమిని కొందరు పెద్దలు మట్టితో నింపి నిర్మాణాలు చేపట్టారు. ఇక్కడ ఎకరం రూ.15 కోట్లకుపైగా విలువ చేస్తుంది. ఈ లెక్కన రూ.450 కోట్ల విలువ చేసే భూమి ఆక్రమణల పాలైంది. జంటజలాశయాలకు ఆనుకుని 150పైగా అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించినా అధికారులు చర్యలకు వెనుకడుగు వేస్తున్నారు. అక్రమ నిర్మాణాలను తొలగించడంతో పాటు కబ్జాదారులపై.. వారికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తప్పని తేలితే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భారతి హోళికేరి

- ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణపై ఫిర్యాదులు
- రెవెన్యూ అధికారులతో కలెక్టర్ హోళికేరి సమీక్ష

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ భూముల్లో ఖాళీగా ఉన్న స్థలాలను జీఓ నంబర్ 59 కింద క్రమబద్ధీకరిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని.. తప్పు చేసినట్లు తేలితే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ భారతి హోళికేరి హెచ్చరించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో పార్లమెంట్ ఎన్నికలు, ధరణి, జీ.ఓ నంబర్ 59 తదితర అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడవలసిన బాధ్యత రెవెన్యూ అధికారులపైన ఉందని తెలిపారు. ప్రజావాణిలో ధరణికి సంబంధించిన దరఖాస్తులు అధిక మొత్తంలో పెండింగ్‌లో ఉన్నాయని.. వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ధరణిలో భూ సమస్యలపై దరఖాస్తు చేసుకునేటప్పుడు సరియైన ఫారంలో నింపేలా సూచించాలని, ఈ విషయం మీసేవ వారికి కూడా తెలపాలన్నారు. జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీలో అలసత్వం వహించరాదన్నారు.

ఆ దరఖాస్తులను పరిశీలించండి..

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్నందున జిల్లాలోని ఆర్‌ఓలు, ఈఆర్‌ఓలు ఫామ్‌–7, ఫామ్‌–8 అర్జీలను పరిశీలించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. శాసనసభ ఎన్నికల్లో అర్బన్ ప్రాంతంలో ఓటింగ్ శాతం తగ్గిందని.. ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని.. ఏవైనా లోటుపాట్లు ఉంటే సవరించుకోవాలని సూచించారు. జాబితాలో పేర్లు తొలగించిన వాటి విషయంలో ఇంటింటి సర్వే చేపట్టి పరిశీలన జరిపించాలని, డూప్లికేషన్లు లేకుండా చూడాలని అన్నారు. ఫామ్‌–8 ద్వారా మార్పులు చేయాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు ఇంకా ఎక్కడైనా కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉంటే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ముఖ్యంగా 1,450 పైన ఓటర్లు కలిగిన చోట కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం ప్రతిపాదించాలని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ జరిగిన పోలింగ్ స్టేషన్లను గుర్తిస్తూ.. అందుకు గల కారణాలను అన్వేషించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఆర్డీఓలు, తహసీల్దార్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు

నూతన ఆవిష్కరణలు చేపట్టాలి

గురుకుల విద్యాలయాల డిప్యూటీ సెక్రటరీ వెంకటలక్ష్మి

ఇబ్రహీంపట్నం: నేటి విద్యార్థులే రేపటి భావి తరాల శాస్త్రవేత్తలని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల డిప్యూటీ సెక్రటరీ వెంకటలక్ష్మి అన్నారు. వినోభానగర్ నల్లకంచె సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన జోనల్ లెవెల్ సైన్స్ ఫెయిర్ బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. నిత్య జీవితంలో కూడా సైన్స్ లాగే ప్రతి అంశాన్ని అన్వేషించినప్పుడే మనిషి నూతన ఆవిష్కరణలు చేపట్టగలడన్నారు. కృషి, పట్టుదలతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. గురుకుల విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించేలా అవసరమైన సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో 65 పాఠశాలల నుంచి 260 మంది విద్యార్థులు 130 ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. అత్యుత్తమంగా నిలిచిన వివిధ పాఠశాల ప్రదర్శనలకు బహుమతులను అందజేశారు. సైన్స్ ఫెయిర్ల నిర్వహణతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయవచ్చన్నారు. విద్యార్థులు కేవలం సిలబస్‌లో ఉన్న పాఠ్యాంశాలే కాకుండా నూతన ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. ఆ దిశగా ఉపాధ్యాయులు వారిని ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గురుకులాల ఆర్‌సీఓ, హెచ్‌ఆర్‌ఆర్ (ఈస్ట్ జోన్) నాగలక్ష్మితోపాటు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్వకుర్తి అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- ఉత్సాహంగా విజయోత్సవ ర్యాలీ



కడ్తాల్: కసిరెడ్డి, వంశీచంద్‌రెడ్డికి గజమాలతో స్వాగతం పలికిన నాయకులు

ఆమనగల్లు/కడ్తాల్: కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యేగా ఎన్నికై న తర్వాత తొలిసారిగా బుధవారం మండల కేంద్రానికి వచ్చిన కసిరెడ్డికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు మండల కేంద్రంలో ఘన స్వాగతం పలికారు. ముందుగా ఎమ్మెల్యే స్థానిక హనుమాన్‌ఘడ్ ఆంజనేయ స్వామి, ఈదమ్మ ఆలయంలో పూజలు నిర్వహించడంతోపాటు బసవేశ్వరుడి విగ్రహానికి పూజలు నిర్వహించారు.అనంతరం మండల కేంద్రంలోని శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై సుమారు రెండు కిలోమీటర్ల మేర భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో భాగంగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యేతో పాటు నాయకులు నివాళులర్పించారు. అనంతరం మైసిగండి మైసమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి దివంగత గిరిజన నాయకులు పంతునాయక్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మైసిగండిలో పార్టీ శ్రేణులు ఎమ్మెల్యేకు గజమాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రాఘవేందర్‌రెడ్డి, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌టీపీ నాయకుడు అర్జున్‌రెడ్డి, నాయకులు సూదినిరాంరెడ్డి, భీక్యానాయక్, నర్సింహ, బీచ్యానాయక్, భాస్కర్‌రెడ్డి, హన్మానాయక్, యాదగిరిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాములుగౌడ్, మోహన్‌రెడ్డి, జహంగీర్‌బాబా, హీరాసింగ్, శ్రీకాంత్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, విఠలయ్యగౌడ్, నరేశ్‌నాయక్, జవహర్‌లాల్, వినోద్, చందోజీ, జహంగీర్‌అలీ, సర్పంచ్‌లు శంకర్, రాము, విజయలక్ష్మి,ఎంపీటీసీలు,నాయకులు పాల్గొన్నారు.

గదను బహూకరించిన నేతలు

విజయోత్సవ ర్యాలీలో భాగంగా బుధవారం మండల కేంద్రానికి విచ్చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి స్థానిక యువజన కాంగ్రెస్ కార్యకర్తలు గదను బహూకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గదను ర్యాలీలో ప్రదర్శించి కార్యకర్తలను ఉత్సాహపరిచారు. నాయకులు నరేశ్‌నాయక్, విజయ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఇందిరమ్మ రాజ్యంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యేగా విజయం సాధించిన కసిరెడ్డి నారాయణరెడ్డి విజయోత్సవ ర్యాలీని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. కడ్తాలలో ప్రారంభమైన ర్యాలీ ఆమనగల్లు, వెల్దండ మండలాల మీదుగా కల్వకుర్తి వరకు కొనసాగింది. విజయోత్సవ ర్యాలీలో చల్లా వంశీచంద్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమనగల్లు పట్టణంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాధవి దంపతులను అభిమానులు గజమాలతో సత్కరించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు సేవకుడిగా పనిచేస్తానని అన్నారు. నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సూదిని రాంరెడ్డి, ఆమనగల్లు ఎంపీపీ అనిత, నాయకులు కేశవులు, జగన్, మానయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించండి

మంత్రి సీతక్కను కలిసిన రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం నాయకులు



మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర నాయకులు

కడ్తాల్: రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క)ను తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఆ సంఘ నాయకులు బుధవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా గడిచిన ఐదేళ్లలో గ్రామాలలో సర్పంచ్‌లు చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రికి వివరించారు. సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేశారు. ఈ మేరకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు, సమస్యలను పరిశీలించి, పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు సంఘం అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి పేర్కొన్నారు. అదే విధంగా గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా సర్పంచ్‌లు పనిచేయాలని మంత్రి సూచించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు భూమన్నయాదవ్, మహిళా అధ్యక్షురాలు ధనలక్ష్మి, సభ్యులు వెంకటేశ్, రామేశ్వర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్‌కు అభినందనలు తెలుపుతున్న మధుసూదన్‌రెడ్డి

కాంగ్రెస్‌తోనే మహిళా సాధికారత

మంత్రికి శుభాకాంక్షల వెల్లువ

షాబాద్: మంత్రిగా బాధ్యతలు చేపట్టిన దనసరి అనసూయ(సీతక్క)ను పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి బుధవారం నగరంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వికారాబాద్ ఎమ్మెల్యే, శాసనసభ స్పీకర్‌గా నామినేషన్ వేసిన గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మహిళలకు వరం లాంటిందని, మహిళల సాధికారత కాంగ్రెస్‌తోనే సాధ్యమని అన్నారు. త్వరలో మిగిలిన గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకం పేదలకు వరంలాంటిదని అన్నారు.

అయోధ్య టు శ్రీలంక

- సనాతన ధర్మ పరిరక్షణకు సైకిల్‌యాత్ర
- మాజీ సైనికులకు పెద్దఅంబర్‌పేటలో ఘన స్వాగతం



పెద్దఅంబర్‌పేటలో సైకిల్ యాత్రకు స్వాగతం పలుకుతున్న ఏసీపీ భీంరెడ్డి తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్: మహారాష్ట్రలోని నాసిక్ ప్రాంతానికి చెందిన శివనారాయణ మిశ్ర, ఉల్లాస్ కులకర్ణి, డాక్టర్ సాయబాబ్ కాసోట్ సైన్యంలో కలిసి పనిచేసిన వీరు ముగ్గురు మిత్రులు. కాగా వీరు ముగ్గురు కలిసి ఆధ్యాత్మిక యాత్ర చేపట్టాలని భావించారు. ఈ క్రమంలో ఇటీవల శ్రీరామ జన్మభూమి అయోధ్య నుంచి శ్రీలంకలో రావణాసురుడిని వధించిన ప్రాంతానికి సైకిల్‌యాత్రకు శ్రీకారం చుట్టారు. సుమారు 5,600 కిలో మీటర్ల మేర కొనసాగనున్న ఈ మాజీ సైనికుల యాత్ర మార్గమధ్యలో బుధవారం పెద్దఅంబర్‌పేటలోని ఔటర్ రింగ్ రోడ్డు కూడలికి చేరుకుంది. దీంతో తెలంగాణ రాష్ట్ర మాజీ సైనికుల సమాఖ్య ఆధ్వర్యంలో సమాఖ్య చైర్మన్ పరెడ్డి మనోహర్‌రెడ్డి, రాజఫణి రవీంద్రాచారి, వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ మన్మోహన్, శివ నారాయణకృష్ణ.. ఈ బృందానికి స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఆరు పదులు దాటిన ఆ ముగ్గురు మాజీ సైనికులు..సైకిల్ తొక్కడం ద్వారా శారీరకంగా, సామాజికపరంగా కలిగే ప్రయోజనాలను యాత్రలో భాగంగా ప్రజలకు వివరిస్తున్నారు. సనాతన ధర్మాన్ని కాపాడాలంటూ మాజీ సైనికులు చేపట్టిన యాత్రలో సైకిల్‌తో ప్రయాణం చేస్తూ ఇందన పొదుపు, కాలుష్య నివారణ, ఆరోగ్యం, వ్యాయామం వంటి ప్రయోజనాలు ఉన్నాయంటూ ప్రజలకు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగ్జీవన్‌చారి, సాలువాచారి, రాజమునిచారి, గంటా ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికలకు కసరత్తు

ఆర్డీఓ కార్యాలయంలో పామెన భీంభరత్



ఆర్డీఓ కార్యాలయంలో వివరాలు తెలుసుకుంటున్న భీంభరత్ తదితరులు

చేవెళ్ల: తర్వలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన వివరాలను ఆర్డీఓ ద్వారా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్ తెలుసుకున్నారు. బుధవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఆర్డీఓ సాయిరాంను కాంగ్రెస్ సీనియర్ నాయకులతో ఆయన కలిశారు. ఈ సందర్భంగా భీంభరత్ ఓటరు జాబితా వివరాలు తీసుకున్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుంటామని, దానికి అనుగుణంగా పూర్తి సమాచారంతో నియోజకవర్గాల వారీగా సిద్ధమవుతామని చెప్పారు. నాయకులు అడిగిన ప్రశ్నలకు ఆర్డీఓ సమాధానం ఇచ్చారు. నాయకులు జనార్దన్‌రెడ్డి, నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు పెంటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయం ప్రారంభం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్: షాద్‌నగర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయాన్ని బుధవారం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. అనంతరం కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని.. అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన అందిస్తామని అన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, జెడ్పీటీసీ తాండ్రవిశాల, ఎంపీపీ ప్రియాంక, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, ఎంపీటీసీల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీశైలం, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, రఘు, బాల్‌రాజ్, మురళీమోహన్, రమేష్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల సుదీర్ఘ పోరాటాల ద్వారానే హక్కుల సాధన

- ప్రముఖ సామాజిక కార్యకర్త, విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ రమా మెల్కోటే



సెమినార్‌లో మాట్లాడుతున్న డాక్టర్ రమా మెల్కోటే తదితరులు

హఫీజ్‌పేట్: సుదీర్ఘ పోరాటాల ద్వారానే మహిళల హక్కులన్నీ సాధించుకున్నామని ప్రముఖ సామాజిక కార్యకర్త, విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ రమా మెల్కోటే అన్నారు. బుధవారం కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లోని నీలం రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సభ సందర్భంగా 'మహిళా రిజర్వేషన్ బిల్లు–సాధికారత' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎస్ఆర్ఆర్‌సి డైరెక్టర్ డాక్టర్ పూర్ణచంద్రరావు, డాక్టర్ రమా మేల్కోటే, భారత జాతీయ మహిళా సమాఖ్య మాజీ కార్యదర్శి డాక్టర్ బి.వి.విజయలక్ష్మిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనకున్న మహిళా హక్కులన్నీ కూడా సుదీర్ఘ పోరాటాల ద్వారానే సాధించుకున్నామని అన్నారు. రాజ్యాగం ప్రకారం మహిళలకు సమాన హక్కులున్నప్పటికి స్త్రీల పరిస్థితుల్లో మాత్రం మార్పు రావడం లేదన్నారు. 1975లో మహిళా దశాబ్దం తర్వాత, మహిళల పట్ల ఆలోచనా విధానంలో కొంత మార్పు వచ్చిన మాట వాస్తవమని, కానీ ప్రభుత్వ విధానాలలో మాత్రం మార్పు లేదన్నారు. దీనివల్ల మహిళలు నిరాశకు గురవటం ఒకవైపు, ఇదే అదనుగా వారిపై హింస పెరగడం కూడా జరుగుతుందన్నారు. ఈ పరిస్థితి మారటానికి మహిళలకు రాజకీయ సాధికారత అవసరమన్నారు. అందుకే ప్రాతినిధ్యం కావాలన్నారు. మహిళల ప్రాతినిధ్య నిర్ణయాత్మక సభలైన పార్లమెంట్, అసెంబ్లీలలో చాలా అవసరమన్నారు. అనంతరం తెలంగాణ ప్రజానాట్య మండలి కళాకారుల కార్యక్రమం అందర్నీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్‌సీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ పి.జె.చంద్రశేఖరరావు, చెన్నమనేని వెంకటేశ్వరరావు, చెన్నకేశవులు, సీఆర్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు డిప్యూటీ సీఎం ఇవ్వాలి

హిమాయత్‌నగర్: రాష్ట్ర జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వడంతో పాటు రాష్ట్ర కేబినెట్ విస్తరణలో 50 శాతం మంత్రి పదవులు బీసీలకే ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రాజేశ్వర్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అగ్రనేతలకు విజ్ఞాపన పత్రాలు పంపించామని రాజేశ్వర్ యాదవ్ తెలిపారు. ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించడంతోపాటు రాజ్యసభలలో బీసీలకు 50 శాతం ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. నామినేటెడ్ పదవుల్లో కూడా 50 శాతం బీసీలను నియమించాలని రాజేశ్వర్ యాదవ్ కోరారు.

కృష్ణా ఆభరణాల-స్టోర్‌కు 'లీడర్‌షిప్' అవార్డు

బంజారాహిల్స్: నగరానికి చెందిన కృష్ణా పెరల్స్ అండ్ జ్యువెలర్స్ తెలంగాణ లీడర్‌షిప్ అవార్డు, ఎక్సలెన్స్ అవార్డ్ ఫర్ బెస్ట్ రిటైల్ కంపెనీ జ్యువెలరీ అవార్డులను సొంతం చేసుకుంది. బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం.10లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు ఈ అవార్డుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. డైమండ్, గోల్డ్, జ్యువెలరీ రంగంలో విశేష అనుభవం ఉన్న ఈ ఆభరణాల వ్యాపార సంస్థ 11 బ్రాంచీలను కలిగి ఉంది. తాము అందిస్తున్న అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు సొంతం చేసుకున్నట్లు నిర్వాహకులు దేవేందర్ కుమార్, అంకిత్ అగర్వాల్ వెల్లడించారు. 1983లో తమ వ్యాపారం ప్రారంభమైందని హైదరాబాద్ ఎయిర్‌పోర్టుతో పాటు నోవాటెల్, పంజగుట్ట, శరత్‌సిటీ క్యాపిటల్ మాల్, నెక్సస్‌మాల్, ముంబై ఎయిర్‌పోర్ట్, దివెస్టిన్ హోటళ్లలో తమ స్టోర్లు నాణ్యత, ఉత్తమ సేవలు వినియోగదారులకు అందిస్తున్నాయన్నారు.

'నేలలేని దేశం' ఆవిష్కరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ కవి, స్కైబాబా సంపాదకత్వంలో పాలస్తీనాపై పలువురు కవులు రచించిన నేల లేని దేశం పుస్తకాన్ని బుధవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన సామాజిక ఉద్యమకారులు ఖాలీదా పర్వీన్ మాట్లాడుతూ పాలస్తీనాకు జరిగిన అన్యాయంపై పలువురు కవులు, రచయితలు రాసిన వ్యాసాలు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు.

గ్రాండ్ ఫినాలేకు సినీనటుడు రాజేంద్ర ప్రసాద్‌కు ఆహ్వానం



నటుడు రాజేంద్రప్రసాద్‌ను ఆహ్వానిస్తున్న ఆటా ప్రతినిధులు

బంజారాహిల్స్: ఈ నెల 30న రవీంద్రభారతిలో నిర్వహించనున్న ఆట గ్రాండ్ ఫినాలే కార్యక్రమానికి ప్రముఖ సినీ నటుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్‌ను ఆటా వేడుకల చైర్మన్, ఎలక్ట్ ప్రెసిడెంట్ జయంత్ చర్ల ఆధ్వర్యంలో బుధవారం ఆయనను కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆటా వేడుకల కో చైర్మన్ వేణు సంకినేని, సెక్రటరీ రామకృష్ణారెడ్డి, కోశాధికారి సతీష్‌రెడ్డి, కో ఆర్డినేటర్ సాయి సుదిని, రవీందర్ గూడురు, ఈశ్వర్ బండా, కాశీ కొత్త, అమృత్ ముళ్లపూడి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన బీఆర్ఎస్

లక్డీకాపూల్: తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ ప్రభుత్వం అప్పుల పాలు చేసిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ప్రత్యేక తెలంగాణ మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన రాష్ట్రమని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బుధవారం ఆయన సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చిన ప్రధాన అంశాలను సత్వరమే పరిష్కారం చేయాలనే అంశంపై మీడియా సమావేశం నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రం కొంత ఇబ్బందుల్లో ఉన్న మాట వాస్తవమన్నారు. ఈ సమయంలో నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం తొలుత ఆర్థికపరమైన సమస్యలు తలెత్తని రిజర్వేషన్ల విషయంలో దృష్టి సారించాలని కోరారు. ఈ క్రమంలో ఆర్థిక భారం లేని హామీలను నెరవేర్చాలని, ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు ఉత్పన్నం కావన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణలో మొట్టమొదటిసారి ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు ఎన్నో ఆశలు ఉన్నాయన్నారు. జనాభా దామాషా ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు తగిన రిజర్వేషన్లు కల్పించాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తప మంత్రివర్గంలో కేవలం ఏడు శాతం ఉన్న అగ్రవర్ణాలకుచెందిన ఏడుగురికి అవకాశం కల్పించారన్నారు. రాష్ట్ర జనాభాలో 50 శాతం ఉన్న బీసీలకు ఇద్దరికీ, 18 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీలకు ఒక్కొక్కరికి ఇవ్వడాన్ని ఆక్షేపించారు. మైనార్టీలకు అసలు చోటే దక్కలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగులకు కూడా ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పించాలని కోరారు.





సంస్కృతి ఎక్సలెన్స్ పాఠశాల విద్యార్థులు పేదలకు అందిస్తున్న వస్తువులు

పేద పిల్లలకు చేయూత

గచ్చిబౌలి: పేద చిన్నారి పిల్లలకు చేయూత అందించారు విద్యార్థులు. అందరికీ ఆదర్శంగా నిలిచారు. సంస్కృతి ఎక్సలెన్స్ పాఠశాల కొండాపూర్‌కుచెందిన విద్యార్థులు మదీనాగూడలోని అదే పాఠశాలకు చెందిన విద్యార్థులతో కలిసి ఇంటింటికి వెళ్లి రకరకాల వస్తువులను సేకరించారు. అనంతరం వాటిని పేద చిన్నారులకు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశారు. అందుకోసం మదీనాగూడలోని పేదలు నివాసముండే ప్రాంతాలకు వెళ్లి వారికి కావాల్సిన వస్తువులను అందించారు. ముఖ్యంగా దినసరి కూలీలు, మహిళలు, యువకులు, పిల్లలకు డబ్బుతోపాటు ఆయిల్ ప్యాకెట్లు, పప్పుదినుసులు, ఇతర వంట సామాగ్రి, దుస్తులను పంపిణీ చేశారు. పలువురు పేద పిల్లలను తమ పాఠశాలకు తీసుకొచ్చి తమకు కావాల్సిన దుస్తులను ఎంపిక చేసుకొనేలా చేసి వారికి సరిపడే వాటిని వారికి అందించడంతో వారి మోములో చిరునవ్వులు వెల్లివిరిసేలా చేశారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మంగళారపు లక్ష్మణ్, డైరెక్టర్ ఆకుల భవాని మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే చదువుతోపాటు వారిలో దాతృత్వభావన నెలకొల్పేలా చేయడమే లక్ష్యంగా నిర్వహిస్తున్నామన్నారు. అవసరమున్న వారికి చేయూత అందించాలనే లక్ష్యంతో దీన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రిన్సిపాల్ సువర్చలా రాణి, కృష్ణప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

మొయినాబాద్: రోడ్డు దాటుతుండగా అతివేగంతో బైక్ ఢీకొట్టడంతో భిక్షాటన చేసే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై హిమాయత్‌నగర్ చౌరస్తా సమీపంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండల పరిధిలోని ఎనికేపల్లి గ్రామానికి చెందిన చాకలి అనంతయ్య(40) భిక్షాటన చేసి జీవిస్తున్నారు. బుధవారం మొయినాబాద్ మండల పరిధిలోని హిమాయత్‌నగర్ చౌరస్తా సమీపంలో స్వామినారాయణ గురుకుల పాఠశాల ముందు రోడ్డు దాటుతుండగా అజీజ్‌నగర్ వైపు నుంచి వస్తున్న బైక్ అతివేగంతో ఆయనిని ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే ఆయన మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

యాచారం: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామానికి చెందిన సురిగి రాములు మొదటి కుమారుడైన కల్యాణ్(21) మాల్‌లో బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. అతడు వ్యక్తిగతంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. దీంతో బుధవారం మాల్‌లో ఉంటున్న అద్దె ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటనారాయణ తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



బాలరాజ్ (ఫైల్)

పహాడీషరీఫ్: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన బాలాపూర్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా పెనివెల్లి గ్రామానికి చెందిన గడ్డిపోగుల బాలరాజ్(29) పదేళ్ల క్రితం బాలాపూర్‌కు వచ్చి ఆర్సీఐ సర్వెంట్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 7న ఆయన సొంతూరుకు వెళ్లాడు. అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ చేయడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భార్య సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 87126 62366 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఉద్యమకారుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

బంజారాహిల్స్: తెలంగాణ తొలి, మలి ఉద్యమ కారుల సంక్షేమం, ప్రయోజనాల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని పీసీసీ మాజీ జనరల్ సెక్రటరీ, 1969 తెలంగాణ ఉద్యమకారుల సమితి ప్రధాన కార్యదర్శి దుష్యర్ల సుదర్శన్ రావు కోరారు. బుధవారం జూబ్లీహిల్స్ లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సుమారు మూడు వేల మంది ఉద్యమ కారులు ఉన్నారని వీరి కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు.

పొగ బాంబులు విసిరితే సమస్యలు పరిష్కారం కావు

ముషీరాబాద్: పార్లమెంటులో పొగ బాంబులు విసిరినంత మాత్రాన సమస్యలు పరిష్కారం కావని సీపీఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. లోక్‌సభలో ఇద్దరు వ్యక్తులు ప్రమాదం లేని పొగ సెల్స్‌తో ప్రవేశించడం భద్రతా వైఫల్యాన్ని తెలియజేస్తున్నాయన్నారు. అయితే వారు చేసిన నినాదాలు వారి మానసిక ఆవేదనను తెలియజేస్తున్నాయని తెలిపారు. వారి చర్య మిలిటెంట్ ఉగ్రవాద చర్య అని ఇది సరైన విధానం కాదన్నారు. భద్రతా వైఫల్యంపై తగు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే 370 ఆర్టికల్ రద్దుతో సహా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల ఫాసిస్టు చట్టాలను యథేచ్ఛగా చేసుకుంటూ పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం ఉపా లాంటి చట్టాలు, రాజద్రోహ చట్టాలు మోపి ప్రతిపక్ష, ప్రజాస్వామ్య, మైనార్టీ గొంతు లేకుండా చేసే ప్రయత్నాలు సమాజంలో అసహనాన్ని పెంచుతున్నాయన్నారు.

17న ఇంటర్నేషనల్ ఫ్యాషన్ షో



బంజారాహిల్స్: దేశంలోని ప్రముఖ డిజైనర్లు రూపొందించిన డిజైన్లను ప్రదర్శించేందుకు బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్‌లో ఈ నెల 17న 'ఎలానోర్ ఇంటర్నేషనల్ ఫ్యాషన్ షో' నిర్వహించనున్నారు. బుధవారం బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన కర్టన్‌రైజర్ కార్యక్రమంలో నిర్వాహకురాలు సబితారెడ్డి వివరాలు వెల్లడించారు. ఈ ఫ్యాషన్ షో ద్వారా వచ్చిన ఆదాయంలో కొంతభాగం హైదరాబాద్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు అవసరమైన సామగ్రిని అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా బ్రోచర్లను ఆవిష్కరించారు.